# ప్రయాణం

నల్లటి చీకటి చుట్టూరా పరచుకుని ఉన్నది. ప్రక్క ఇంటివాళ్ళ గడియారము పదకొండుగంటలుకొట్టింది ప్రయాణానికి సర్దిన సామాను, హాలులోపెట్టారు. వెనుక వరండాలో చాప పరచుకొని పడుకొని సౌభాగ్యమ్మ నిద్రపట్టక, అటూ ఇటూ దొర్లుతూవున్నది. హాలులో శేషగిరి కూర్చుని, ఉత్తరాలు రాసుకుంటున్నారు అప్పటివరకూ.

ఆ ఉదయం జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది సౌభాగ్యమ్మకి. కనులవెంట నీరు ఊరింది. అతినికి నిస్సహాయముగా ఆ అవస్తకి తనేమయింది సౌభాగ్యమ్మ! శేషగిరి ఎంతగా మారిపోయినాడు?!

శేషగిరి తనని ఇంతకుముందూ, భూషణం సూటిగా అన్నమాటలు ఇంకా గుండెల్లో మ్రోగుతూ, 'కలక' వేస్తూనే ఉన్నాయి సౌభాగ్యమ్మకి నౌకర్లని అన్నట్టు అన్నాడు తనని. సౌభాగ్యమ్మ అప్పుడు తెల్లపోయి చూస్తూ నిలబడిపోయింది, కన్న

కొడుకే అట్లా అంటూవుంటే. అప్పటిదాకా ఇంట్లో లలితా శేషగిరి ఘర్షణపడినారు.

చిరాకుగా ధుమ ధుమలాడుతూవున్న మొహంతో బయటికివచ్చి తనకి యెదురు — నిలబడిపోయేడు, బల్లకి ఆనుకుని శేషగిరి.

లలిత సన్నజాజిపూలు కోస్తూ వున్నట్టు నటిస్తూ ఒక చెవి ఇటే పారేసి ఉంచింది. వీధరుగుమీద చుట్టకాల్చుకుంటూవున్న భూషణం రెండుచెవులతో రిక్షించాడు. శేషగిరి మళ్ళీ అన్నాడు. "ఇదైమీ బాగాలేదయ్యా! అందరూ రమ్మంటూవుంటే అలా మొండికెత్తడము నీకూ బాగా ఉందా? ఆమధ్యన ఎవరో పోతూవుంటే నీకూ చూడాలని ఉందని అడిగింది. ఏవో యిబ్బందులవలన అప్పుడు వీలుకాలేదనుకో. ఇప్పుడు అంతా కలిసి వెడుతూవుంటే నువ్వు రానంటావు ఏమిటే?"

రెండు నిముషాలు అట్లాగే నిలబడినాడు శేషగిరి. సౌభాగ్యమ్మ జవాబుకోసము చూస్తూ మౌనంగా నిలబడిపోయింది. ఈ మధ్యన, కొడుకుమొహంలోనికి చూడటానికే ఆమెకి అయిష్టంగా ఉంటున్నది.

"నీకుకూడా అందరితోపాటు టిక్కెట్టు కొంటున్నాను" అనేసి గబగబానడిచి బయటికి వెళ్ళిపోయాడు శేషగిరి.

లలిత (ఇదంతా విని) నవ్వు నణచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది, పూలుతీసుకొని భూషణంగారు చిన్నగా దగ్గారు సంతోషం సూచిస్తూ అరుగుమీదనుంచి.

అసలు ఆ విషయం శేషగిరే తనతో స్వయంగా చెబు తాడని ఆశించింది సౌభాగ్యమ్మగారు. కాని అటువంటిదేమీ జరుగలేదు. శేషగిరి అడిగివుంటే తను కాదనేదే కాదు.

లలిత చెప్పింది. శేషగిరి నెల్లాళ్లు సెలవుపెట్టారట. ఈ నెల్లాళ్లూ దక్షిణాదిన చూడవలసిన ప్రదేశాలలో పుణ్య క్షేత్రాలు చూసిరావాలనుకుంటున్నారట! సౌభాగ్యమ్మగారికి పిల్లల 'ఝుంఝాటం' వుండటంచేత తీసుకెళ్ళకూడదని ముందు అనుకున్నారట. శేషగిరీ, భూషణమూ. కాని "ఆవిడమాత్రం ఎప్పుడు చూస్తుంది" అవటాని, తను పట్టుపట్టటంవలన వొప్పు కున్నారట!

పిల్లల్ని ఇద్దరినీ వాళ్ళ తాతగారిదగ్గర దిగవిడిచి రావ టానికీ నిశ్చయమయిందట!

ఈ మాటలు విన్నాక సౌభాగ్యమ్మహృదయం కొంచెం కుదుటపడింది ఒకరకంగా.

రెండురోజుల క్రితమే శేషగిరి రఘునీ, రాణినీ తనతో తీసుకెళ్ళాడు. వాళ్ళ బట్టలవీ కూడ సర్దించి తీసుకెళ్ళడం, సౌభాగ్యమ్మకి ఆశ్చర్యం కల్గించింది. కాని అవిడకి అసలు సంగతి ఎవరూ చెప్పనేలేదు. పిల్లలకికూడా తెలియదేమో! వాళ్ళూ సౌభాగ్యమ్మతో అనలేదు. "అయితే, వాళ్ళని, ముస లాయన దగ్గర ఉంచారన్నమాట. అదీ ఒకరకంగా మంచిదే" అనుకుంది సౌభాగ్యమ్మ. లలిత దొంగమాటలకు లోలోనే నవ్వుకుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? మీకూ ఇష్టమేగదా!" అంది లలిత. సౌభాగ్యమ్మ మౌనంగా ఉండిపోయింది. ఏదో గొణుగుకుంటూ, లలిత వెళ్ళిపోయింది. లలిత కోపం నసాళాని కంటింది, నిజానికి సౌభాగ్యమ్మకీ వెళ్ళాలనేఉన్నది. మామూలుగా ఇట్లాంటి విషయం విని ఆవిడ ఎంతో ఆనందపడి, వెంటనే తన అంగీకారం తెలిపి వుండాలిసింది. కాని మూభావంగానే ఉండిపోయింది ఆమె. దానికి బలమైనకారణం ఉన్నది. అసలు ఆ రోజు సాయంత్రం, ఆ మాటలు సౌభాగ్యమ్మ చెవినిపడి ఉండకపోతే ఆమె సంతోషపూర్వకంగా అంగీకరించే ఉండేది. అవసరంమీద ప్రక్క యింటికివెళ్ళితిరిగివచ్చింది సౌభాగ్యమ్మ ఆ సాయంత్రం.

'పడమటింటి' లో నుంచి మాటలువినిపించాయి. వింటూ మ్రాన్పడి అలాగే నిలబడిపోయినది సౌభాగ్యమ్మ. ఒకటి భూషణం గొంతు. రెండవది లలితది. శేషగిరి ఇంకా యింటికి తిరిగి రాలేదు అప్పటికి.

"మీ అత్తనికూడా తీసుకువెళుతున్నారా?"

"ఎందుకూ తగలాటం? ఇంట్లో ఉంటుంది" కత్తితో కోసినట్టు వచ్చింది సమాధానం.

"పోనీ, రానివ్వరాదూ? ఆమధ్యనా, ఒకసారి అడిగిందని అంటివి. ముసలివాళ్ళకి ఏదో కోరికలు ఉంటాయిగా."

కోరికలు ఎవరికి ఉండవు? నీ ఛాదస్తం కాని, అసలే డబ్బుకి 'కటకట' గా ఉంది. ఇప్పుడు ఆవిడకూడా బయలుదేరితే బోలెడు డబ్బు, తడిసి మోపెడవుతుంది."

"అదికాదే పిచ్చిపిల్లా! దానివలన ప్రియోజనమూ ఉంది. ఆవిడ వచ్చినా ఆదనంగా పెద్ద కర్చూ కాదూ. శేష గిరి 'హోటలుతిండి' సహించదంటూ వుంటివి. వెళ్ళినచోట నల్లా, వంటపెట్టుకుని కూర్చుంటే నీవు ఇక చూసేదేమి వుంటుంది?

కనుక ఆవిణ్ణికూడా తీసుకెడితే అటు తీసుకెళ్ళినదానివి అవుతావు. ఇటు అవసరమూ గడిచిపోయింది. నువ్వు హాయిగా అన్నీ చూడవచ్చును."

"నిజమే! ఇంతకీ వంట చెయ్యటానికిఆవిడని తీసుకెళ్ళాలంటావు. బాగానేవున్నది. కాని పిల్లలు ఉన్నారుగా? వాళ్ళని ఎవరినె తిమీద పెట్టాలి?

"ఎవరూ? మా ఆడబిడ్డ పిల్లలా? ఇంకా...ఆ ముసలాయన ఉన్నాడుగా మీా రేదో సరిగా చూడటంలేదని అందరి దగ్గరా అల్లరిచేస్తున్నాడంటివి! అక్కడేపెట్టేస్తేసరి. అందులో ఉన్న సాధకబాధకాలు ఆయనగారికీ తెలిసొస్తాయి. ఒకదెబ్బకి రెండుపన్లు అవుతవి!"

భూషణం పకపకమని నవ్వాడు. లలితకూడా నవ్వుతూ శృతి కలిపింది. సౌభాగ్యమ్మగారు నిట్టూర్చింది. చివరికి తనూ తన కూతురు బిడ్డలూ అంతలోకువ అయ్యారన్నమాట! అసలు ఎవరని ఏమనిలాభం? తన కన్నకొడుకే అట్లా మారిపోయాక! తన ఇంట్లోనే తను అంత హీనంగా బతకాలని వస్తుందని సౌభాగ్యమ్మ కలలోనయినా అనుకుని ఉండలేదేమో?

అందుకే లలిత అడిగినప్పుడు ముభావంగా వుండిపోయింది సౌభాగ్యమ్మ. భూషణంవచ్చి గుచ్చిగుచ్చి అడిగి

నప్పుడు "తను రాన"ని ఖండితంగానే, చెప్పేసింది. భూషణం ఎట్లాటి భూషణం ఏరకంగా మారిపోయాడు? తండ్రీ, కూతుళ్లు కావాలని ఆమెమీద కత్తికట్టారు, భూషణం సౌభాగ్యమ్మకి వరసకి తమ్ముడు అవుతాడు, దూరపు చుట్టకరిము. ఆ రోజులలో సౌభాగ్యమ్మ సంసారము మూడు పువ్వులూ, ఆరు కాయలూగా పచ్చగా వున్నప్పుడు భూషణం వస్తూ వుండేవాడు. అప్పుడతను చిన్నవ్యాపారము చేస్తూ వుండేవాడు.

"అక్కయ్యా! మా చిన్నమ్మాయి, లలిత బంగారపు బొమ్మ. చిదిమి నీ యింట్లో దీపం పెట్టుకోవచ్చును. దాన్ని నీ కోడలుగా చేసుకున్నావంటే. ఇందులో బావగారి ప్రమేయం లేదు. ఆయన తెలదూర్చటానికీ వీలు లేదు." అనేవాడు, నవ్వుతూ భూషణం.

ఆయన నవ్వేవారు సౌభాగ్యమ్మ వంక చూస్తూ.

"అట్లాగే లేరా" అనేది తనూ. నవ్వుతూనే కాలము 'బిరబిర' పరుగెత్తిపోయింది. సావిత్రి పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. శేషగిరి కాలేజీలో చేరేడు.

శేషగిరి వట్టి అమాయకుడు. నోట్లో నాలుక లేనివాడు. సావిత్రి మాత్రము గట్టిది. దానికి తండ్రిపోలికలు వచ్చాయి. తనబిడ్డలు యిద్దరూ కడిగిన ముత్యాలు. ఆనందప్రదమైనది తన సంసారము కాని యిది చూసి విధి వోర్వలేకపోయినది!

ఒకనాడు హఠాత్తుగా ఆయన సౌభాగ్యమ్మని వదిలి పెట్టి తనదారిని తను చూసుకున్నారు, పుణ్యాలోకానికి. సౌభాగ్యమ్మ వంటరిదయిపోయింది.

కాని సౌభాగ్యమ్మ ధైర్యంగా నిలబడింది. పుట్టెడు దుఃఖాన్ని గుండెల్లో దాచుకుంది. శేషగిరిమీద ప్రాణాలు నిలుపుకుని గుండె రాయి చేసుకుంది.

కాని శేషగిరి యింకా అర్భకుడా! ఆ మహారాజు వెన కాల బాగానే మిగిల్చిపోయేడు! కాని అది చాలవరకూ తగా దాల్లో ఉండిపోయింది. తను ఆడది. ఎన్నని చూసుకోగలదు? కనుక యిటువంటి పరిస్థితులలో వీటన్నిటినీ చూసిపెట్టడానికి ఒకమనిషి అవసరము. సౌభాగ్యమ్మదృష్టిలో భూషణం ఒకనా డన్న మాటలు మెదిలేయి అప్పుడు.

ఆ ఉద్దేశ్యంతోనే ఒకనాడు పనిగట్టుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళి భూషణాన్ని పెళ్ళివిషయము కదలేసింది. ఏ సంగతీ చెప్ప మని నిలదీసింది ఆఖరికి, అతను దాటవేస్తూంటే, ఓపికగా, భూషణము అంతా విన్నాడు. ఏవేవో చాలా మాటలుచెప్పి సౌభాగ్యమ్మకి ధైర్యం పలికేడు. కాని అసలువిషయం దగ్గరకు వచ్చేసరికి, శేషగిరికి లలితని యివ్వడానికి యింట్లో వాళ్ళు వప్పుకోవడంలేదని చెప్పి, తప్పుకున్నాడు. భూషణం లౌక్యం తెలిసినవాడు. అతనికి అట్లాఅనటము అంత కష్టమనిపించ లేదు.

అదివిని సౌభాగ్యమ్మ దిగాలుపడిపోయింది. ఈమధ్యన భూషణము వ్యాపారము చాలాబాగా ఉన్నదని ఆమే విన్నది. అతను ఇట్లా తప్పించుకోనడానికి అదేకారణము కావచ్చును. అయితే ఆ మనిషిమాటకివున్న విలువ అంతేనా?

"పోనీలే అమ్మా! ఈనాడు నాలుగురాళ్లు పోగుచేసి నంతమాత్రాన అల్లుళ్లు ఎప్పుడూ అధికులు కాలేదు. అసలు

నువ్వు భూషణంగారిని ఆవిషయం అడగకుండానే ఉండాలిసింది. శేషగిరిని చదువుకోనివ్వు. వాడికి ఏమితక్కువ? వాడిపెండ్లికి తొందర యేమున్నది? ఆ వ్యవహారాలేమన్నావుంటే మీా అల్లుడు చూస్తారులే” అని సౌభాగ్యమ్మకి ధైర్యంచెప్పింది సావిత్రి. అన్నట్లుగానే ఆ స్త్రీవిషయంగాక ఉన్నతగాదాలన్నీ పరిష్కరించి అంతా ఒకదారికి తీసుకువచ్చాడు అల్లుడు ఆరు నెలల్లోనే.

అది జరిగి సంవత్సరమైనా తిరగకుండానే, తనకే ధైర్యంచెప్పిన కన్నకూతురు ఇద్దరు పిల్లల్నీవిడిచి తనకి అన్యాయంచేసి పోతుందని అప్పట్లో వూహించలేకపోయింది సౌభాగ్యమ్మ. సావిత్రి గుండెజబ్బుతో మరణించింది.

శేషగిరి పసిపిల్లాడిలాగు యేడిశాడు. సౌభాగ్యమ్మ శోకమూర్తే అయింది. ఎవరికి తప్పినా సౌభాగ్యమ్మకి తప్ప లేదు. సావిత్రి పిల్లల్ని యిద్దర్నీ తనతో తీసుకుని వచ్చింది ఆమె. సావిత్రి మామగారు యెంతో బాధపడిపోయారు, సంవత్సరముయినా తిరగకుండానే రెండోపెళ్ళి చేసుకున్న కొడుకును గురించి.

“ఆ పిల్లల్ని యేమి చేస్తావు?” అని ఆయన కొడుకును మీాద దెబ్బలాడేరు. పిల్లలిద్దరి పేర్నా, కొడుకుచేత కొంత ఆస్తిని, రాయించిగాని ఆయన శాంతించలేదు. కోడలు, సావిత్రిని తల్చుకుని యిప్పటికీ కళ్ళవెంట నీరు పెడతాడు ఆయన.

పిల్లలు యిక్కడే వున్నారు గనుక వాళ్ళ ‘ఆస్తి’ కూడా శేషగిరి పర్యవేక్షణ కిందికే వచ్చింది. ప్రతిసంవత్స

రమూ యెంతో డబ్బు వస్తున్నది? అది ఏమవుతుందో సౌభా
గ్యమ్మకి తెలియదు. ఈ విషయమై ఆమెని చీకట్లోనే ఉం
చారు అందరూ.

సావిత్రి మామగారు అప్పుడప్పుడువచ్చి, పిల్లల్ని చూసి
పోతున్నారు.

సౌభాగ్యమ్మ, పిల్లల్నయితే తీసుకునివచ్చిందిగాని,
వాళ్ళ చదువు సంధ్యలు యేమి చూడగలదు? ఆ పిల్లలు గతి
లేక, వచ్చి వీళ్ళపంచను చేరలేదు.

శేషగిరి వాళ్ళనిగురించి తనకున్న బాధ్యతని సక్ర
మంగా నెరవేరుస్తున్నాడా? అన్నదే ప్రశ్న. కనీసం సావిత్రిని
తల్చుకునయినా, వాళ్ళగురించిన కనీసపు శ్రద్ధను కన్పరచ
వచ్చునే? అదీ తనకుచాతకాకపోతే, వాళ్ళని ఆ ముసలాయన
దగ్గరకే పంపితే ఆయన పువ్వుల్లోపెట్టి యింత కంటే శ్రద్ధగా
చూసుకుంటాడే? తన వంశాంకురాలన్న అభిమానం కొద్దీ,
వాళ్ళకోసం ఆయన యేమయినా చెయ్యగలడు యిప్ప
టికీ.

ఆయన పాటి కూడా చెయ్యలేక పోతున్నాడు శేషగిరి,
అక్క సంతానమన్న అభిమానము కూడా మరిచిపోయి.
స్వార్థం మనుషుల్ని యిట్లా మారుస్తుందేమో?

నిజం ఈ తప్పంతా తనదేనని వప్పుకుంటుంది సౌభా
గ్యమ్మ. అట్లా అప్పుడు, కావాలని తను వెళ్ళి అడిగితే ఏదో
చెప్పి తప్పించుకున్నాడు భూషణం. రెండేళ్లు గడిచిది. శేష
గిరి బి. ఏ. పరీక్షలు రాశాక ఒకసారి సౌభాగ్యమ్మతో
అన్నాడు, మాట వరుసకి.

బజారులో భూషణం కనిపించి ఇంటికి తీసుకెళ్ళారట! ఇంట్లో వాళ్ళందరూ శేషగిరిని ఎంతగానో ఆదరించారట! లలిత కింకా పెళ్ళికాలేదట! భూషణంగారి వ్యాపారం దివాళా తీసిందట. అందరూ ఆమెగురించీ అడిగేరట ఎంతో ఇదిగా. అంటూ చెప్పి "పాపం వాళ్లు కష్టాలతో ఉన్నారు" అన్నారు శేషగిరి.

సౌభాగ్యమ్మకి ఎంతో జాలికలిగింది. ఇల్లు ఎక్కడో కనుక్కొని ఆ సాయంత్రమే భూషణం ఇంటికి వెళ్ళింది. భూషణం ఆమెని చూసి ఆశ్చర్యపోయాడు. తరవాత ఎంతో సంతోషపడినాడు. "అక్కయ్యా! నీ మనసు ఎంతో దొడ్డది. అభిమానం ఉంచి తిరిగి నా గడప తొక్కావు. నాకు అది చాలు. దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు" అన్నాడు కృతజ్ఞతగా. అది జరిగి రెండురోజులయినా తిరగకుండానే, భూషణం అన్నమాటలు విని సౌభాగ్యమ్మకనక ఆశ్చర్యపడలేదు. దేన్నీ మనసులో పెట్టుకుని కుళ్ళిపోయే స్వభావంకాదు ఆమెది. తిరిగి అదే నోటితో, సిగ్గువిడిచి, లలితని శేషగిరికి ఇస్తానని ప్రాధేయపడి అడిగాడు అతను. అప్పటికి వాళ్ళస్థితిచూసి జాలితో కరిగిపోయిన సౌభాగ్యమ్మ కాదనలేకపోయింది. శేషగిరి కూడా లలితగురించి నిద్రలో కలవరింతలు ప్రారంభించాడు.

ఉన్నమాట చెప్పాలంటే లలితమ్మ బంగారపు బొమ్మ!

నెలరోజులయినా తిరగకుండానే పెళ్ళి జరిపించాడు తెలివిగల భూషణం. మొదట్లో యెంతో ఆదరణగా వుండే లలితమ్మ, రాను రాను బలం పుంజుకుని గట్టిపడింది. శేషగిరి పూర్తిగా ఆక్రమించాక ఆవిడ అకారణంగానే కత్తికట్టి సౌభాగ్యమ్మమీద దండెత్తినది. దానికి కారణం కనిపించలేదు, యెంత వెదికినా సౌభాగ్యమ్మకి.

ఒకనాడు అదే యింట్లో సౌభాగ్యమ్మ ఇష్టారాజ్యంగా నడిచింది. సౌభాగ్యమ్మకి ముందు ఆమె అత్తగారు, ఇప్పుడు లలితమ్మ. రేపు మరొకరు. ఆ రకంగా ఒకవ్యవస్థలో ఎన్నో మార్పులు తెచ్చిపెట్టగలదు కాలము.

కనుక దాన్నిగురించి సౌభాగ్యమ్మ ఎప్పుడూ బాధపడ లేదు. ఎటొచ్చీ ఆవిడ బాధపడేది సావిత్రి పిల్లలని గురించే. సావిత్రి తనని నిలదీసి అడిగినట్లు అనిపిస్తుందామెకి. "అమ్మా! "అమ్మా! నువ్వుండీ, నా పిల్లలకి అన్యాయం జరగనిస్తావా? శేషగిరి పెళ్ళానికి దాసుడైపోయేడు. సరే నువ్వు వుండీ. పెద్ద దానివి. ఏంచేస్తున్నావు?" అని. దానికి సమాధానం దొరకక సౌభాగ్యమ్మ మనసు గిలగిలలాడిపోతుంది.

నిజంగా శేషగిరి యెంత మారిపోయాడు లేకుంటే, ప్రొద్దుట, లలితముందూ భూషణంముందూ తనమీదా అల్లా కేకలువేసి ఉండేవాడేనా? తల్లికంటె, వాడికి నిన్న కాక మొన్నవచ్చిన 'పెళ్ళాం', 'మామ' ఎక్కువయినారా?

"నేను యెందుకు రానంటున్నా"వని వాడుస్వయంగా అడుగడు? 'పిచ్చిసన్నాసి' కి చిన్నప్పటిన్నించీ బక్కకోపం.

వుంది. అదంతా ఎవరిమీదనో, చూపించాలిగదా!" కళ్ళు వత్తుకొని ప్రక్కకు తిరిగి పడుకుంది సౌభాగ్యమ్మ. చెవిలో దోమలు సంగీతం పాడుతున్నాయి.

'రోడ్డు' మీద రిక్షాలు గంటలు మోగించుకుంటూ వెళ్తున్నాయి. మొదటిఆట సినిమా. వదిలి పెట్టినట్లున్నారు. శేషగిరి రాసుకోవటం అయిపోయినట్లుంది.

కలం 'అల్మారా'లో పెట్టడానికి గదిలోనికి వెళ్ళేడు శేషగిరి. 'బెడ్ లైటు' వెలుగులో మంచం మీద పడుకుని నిద్రపోతున్నది లలిత. కనులు మిరుమిట్లు గొలుపుతున్నది ఆ అందము! సొగసులు అన్ని, మిళాయించి, అందాలన్నీ యేరి కూర్చినట్లు వెలుగుతున్నది అద్భుతముగా, ఆ బాలిక! కాసేపు రెప్ప వేయకుండా ఆమెనే చూశాడు, శేషగిరి. అంత అందమునకు వెనుక, వికృతమయిన మనస్సును పెట్టడము 'భగవానుడి లీల 'కాబోలు!' అనుకుని నిట్టూర్పు విడిచేడు శేషగిరి.

"నిజంగా, స్వార్థము మూర్తీభవించి ఘనీభవించి, కరుడుగట్టిన హృదయము లలితది! దానికి న్యాయము, జాలి అనేవి యెప్పుడూ ఆమడ దూరాన్నే వుంటవి! అందువలననే సావిత్రి అక్కయ్య పిల్లలకి నేను న్యాయం కలగ చెయ్యలేక పోయాను. ఆఖరికి అట్లా అంతా మంచిగానే జరిగిం" అనుకుంటూ హాలులోనికి వచ్చేడు శేషగిరి.

ఎదురుగా గోడన వ్రేలాడుతూ వున్న సావిత్రి ఫోటో చూసి రాజూలా, తలవంచుకోలేదు అతను.

తలుపు చప్పుడు కాకుండా బయటికి వచ్చాడు శేష గిరి. సౌభాగ్యమ్మగారు నిద్రపట్టక అటూ ఇటూ దొర్లు తున్నది. దగ్గరికివెళ్ళి చాపమీద కూర్చున్నాడు శేషగిరి. ఉలికిపడి కనులు తెరిచింది సౌభాగ్యమ్మ. తనకొడుకు, తన పక్కలో కూర్చున్నాడు.

"అమ్మా! నిద్రపట్టటము లేదా? ఆప్యాయంగా అడిగి, తిరిగి అన్నాడు శేషగిరి.

"రఘునీ, రాణినీవాళ్ళతాతగారి దగ్గరవుంచి వచ్చేశాను. ఆయన యెంతో సంతోషపడినారు. ఇన్నాళ్ళనుంచీ వాళ్ళ పొలముమీద వచ్చిన 'డబ్బు' బాంకులో వేశాను. ఆ డబ్బు కూడా ఆయనకే అప్పచెప్పాను. ఆయన అప్పుడే వాళ్ళ చదు వుకి మంచియేర్పాట్లు చేశారు. నేను ఆవిధంగానయినా, ఒక మంచిపని చేశానన్న తృప్తి కలిగింది నాకు. ఈ సంగతి బావకి చెపుదామనుకున్నాను. కాని ఆయన కనపడలేదు. ఈ వంక చూపించి, నేను చెయ్యాలనుకున్నది చేసేశాను. మామూలుగా, అయితే ఈ పని, నావలన అయేదికాదు. వాళ్ళని ఎట్లా అయినా ప్రయాణం గురించి అక్కడ వదలాలి గదా! పనిలో పని తెగించాను. తరువాత ఈ సంగతి వాళ్ళకి తెలిసినా కేవలం నన్ను గొడవపెట్టడం తప్ప, మన చేతులలో యేమీలేదు, ఇప్పుడు యిక. పిల్లల్ని నీకు చూడాలనిపిస్తే ఎప్పుడయినా వెళ్ళి రావచ్చును. ఇక వాళ్ళు అక్కడవుంటారు. ఈ విషయం మనసులోనే వుంచుకో, మొన్నే చెబుదామను కున్నాను. వీలులేకపోయింది" అన్నారు శేషగిరి. 'కారణం

ఏమిటి?' అని అడిగితే చెప్పలేదుగాని, నిజంగా అప్పుడు సౌభాగ్యమ్మ వెక్కి వెక్కి ఏడిచింది. శేషగిరి చెయ్యివేసి నిమిరేడు. "పిచ్చి అమ్మా! ఎందుకూ యేడుస్తావు? నేను చేత కాని వాడినయి నీ మీద ప్రొద్దున కేకలు వేశాననా? నేను యేమి చేసినా, నన్ను నా తల్లి క్షమించగలదు. గాని ఇంకొకళ్ళయితే వూరుకుంటారా?" అంటూ ఆమె కన్నీరు తుడిచేడు. సినిమానుంచి వచ్చి తలుపు తడుతూ ఉన్న భూషణానికి వీధి తలుపు తీయటానికి, ప్రయాణానికి సర్ది హాలులోవుంచిన సామానుగుండా అడుగులు వేసేడు శేషగిరి.